క్లుప్తంగా

విద్యార్థుల విజ్ఞాన వికాసానికి పుస్తక పఠనం



పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం: విద్యార్థుల విజ్ఞాన వికాసానికి పుస్తక పఠనం ఎంతో దోహదం చేస్తుందని అచ్యుతాపురం శాఖ గ్రంథాలయ అధికారి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా అకడమిక్ జ్ఞానంతో పాటు, వర్తమాన అంశాలపై అవగాహన పెరుగుతుందని, తద్వారా పోటీ పరీక్షల్లో రాణించవచ్చన్నారు.

నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

నక్కపల్లి: ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో సోమవారం నుంచి పది రోజుల పాటు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నక్కపల్లి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వీర్రాజు తెలిపారు. 20 నుంచి 21వ తేదీ వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రోజూ మండలానికి 2 శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు నట్టల నివారణకు మందులతోపాటు, టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అనారోగ్య పశువులకు, చూలు నిలవని, చూలుకు రాని పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

గొడిచర్లలో పూరిల్లు దగ్ధం

నక్కపల్లి: గొడిచర్లలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. కొండ్ర సత్యవతికి చెందిన పూరిల్లు దగ్ధమయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు వ్యాపించడంతో సర్వం బూడిదయిందని ఆమె వాపోయింది. కూలి పనులకు వెళ్లడంతో ప్రమాద విషయం చుట్టుపక్కల వారి ద్వారా తెలిసిందన్నారు. స్థానికులు మంటలను ఆర్పేలోపే ఇంట్లో దుస్తులు, వంట సామగ్రి, కిరాణా సరుకులు, మంచాలు, కొద్దిపాటి నగదు, ఆభరణాలు కాలిపోయాయన్నారు. బాధితురాలిని ఎంపీటీసీ సభ్యుడు నిట్ల గోవిందు పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు ప్రారంభం



కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచ్, గ్రామస్తులు

కోటవురట్ల: పాములవాక ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సర్పంచ్ డి.సత్యవతి ఈ పనులను ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. కమ్యూనిటీ హాల్‌కు ముందు సిమెంట్ ప్లాట్‌ఫాం, హాలులో ఎలక్ట్రికల్ వైరింగ్‌తో పాటు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. హాలుకు ముందు షెడ్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ పెద్దలు డి.లోవరాజు, బొండల రాధా, వార్డు మెంబరు చంద్రరావు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



సరుగుడు వద్ద జలపాతంలో జలకాలు

నాతవరం : సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది, ఎత్తయిన రెండు కొండలు మధ్యలోంచి ప్రవహించే జలపాతంలో సందర్శకులు జలకాలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. సంహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలక్షేపం చేశారు. రెండు జిల్లాల నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో సరుగుడు వెళ్లే రోడ్డులో వాహనాల తాకిడి పెరిగింది.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!

లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!

సంప్రదించవలసిన నెంబరు

7331100207, 7997958344

శక్తి పీఠంగా రేబాక గూడుపమ్మ గుడి

- రూ.కోటితో ఆలయ పునర్నిర్మాణం
- వచ్చే నెల 7న ప్రారంభోత్సవం
- 10 మెరక గ్రామాల ఇలవేల్పుగా పూజలు



ఆలయం గోపురం చుట్టూ అష్టాదశ శక్తి పీఠాల విగ్రహాలు



పచ్చని చెట్ల మధ్య నూతనంగా నిర్మించిన గూడుపమ్మతల్లి ఆలయం



ఆలయంలో కొలువుతీరిన గూడుపమ్మతల్లి అమ్మవారు

నక్కపల్లి: ఆలయాలు మన ప్రాచీన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలు.. వాటికి పూర్వ వైభవంతోనే గ్రామాల్లో భక్తిభావం వెల్లివిరుస్తోంది. ఇదే సూత్రాన్ని నమ్మిన పది మెరక గ్రామాల ప్రజలు తమ ఆరాధ్య దైవంగా భావించే రేబాక గూడుపమ్మ తల్లి గుడికి కొత్త రూపు తెచ్చారు. దాదాపు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని గ్రామస్తులు, దాతల సహకారంతో రూ.కోటితో పునర్నిర్మించారు. ఇకనుంచి అమ్మవారు శక్తిపీఠంగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. మండలంలో రేబాక, తిరుపతి పాలెం, రమణయ్యపేట, గుల్లిపాడు, జగన్నాథపురం, సీతానగరం, చీడిక, దోసాలపాడు, ముకుందరాజుపేట, రేవళ్లు, తదితర పది గ్రామాలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు గూడుపమ్మతల్లిని ఎంతో భక్తి శ్రద్ధలతో కొలుస్తుంటారు. రేబాకలో చుట్టూ ఎత్తయిన కొండలు మధ్యలో పెద్ద పెద్ద చెట్ల మధ్య గూడుపమ్మతల్లి పురాతన ఆలయం ఉంది. ప్రతి రెండేళ్లకొకమారు ఇక్కడ అమ్మవారి పండుగ, జాతర పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. అమ్మవారు కోరిన కోర్కెలు నెరవేర్చే వనదేవతగా మెరక గ్రామాల ప్రజలు ఆరాధిస్తారు.

కార్తీక మాసంలో పిక్నిక్‌లు...

కార్తీక మాసంలో ఈ ఆలయానికి స్థానికులతోపాటు, పాయకరావుపేట, నక్కపల్లి, తుని, తదితర చుట్టు పక్కల నుంచి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కార్తీక వనసమారాధనలతో పాటు ప్రతి ఆది, మంగళ, గురు వారాల్లోనూ అమ్మవారి ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుని కానుకలు సమర్పించుకుంటారు. జాతీయ రహదారికి 15 కిలోమీటర్ల దూరంలో రేబాక కొండల మధ్య ఉన్న ఆలయానికి వివిధ ప్రత్యేక సందర్భాల్లో వేలాది మంది భక్తులు వచ్చి దర్శించుకుంటారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండల మధ్య ఉన్న తమ గ్రామాలకు ఎటువంటి ఆపద రాకుండా గూడుపమ్మతల్లే కాపాడుతుందనేది ఈ ప్రాంత వాసుల నమ్మకం. కార్తీక మాసంలో వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులతో కుంకుమ పూజలు నిర్వహిస్తారు. ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న ఆలయం జీర్ణావస్థకు చేరుకుంది. దీంతో మాజీ సర్పంచ్, విశ్వహిందూ పరిషత్ నేత గొట్టుముక్కల శ్రీహరిరాజు, సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు కలిసి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాతల సహకారంతో కోటి రూపాయలతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ పనులు 2020లో ప్రారంభమై పూర్తి కావచ్చాయి.

ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు...

వచ్చే నెల ఏడో తేదీన ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఆలయాన్ని శక్తిపీఠంగా తీర్చి దిద్దారు. గర్భగుడి ఉన్న చోటే అమ్మవారి మూలవిరాట్ ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రధాన ఆలయంలో నవదుర్గలను ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయం చుట్టూ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, కాలభైరవుడు, వనదేవత, నాగదేవత, అష్టాదశ శక్తిపీఠాలు, సరస్వతీ దేవి మందిరం, అష్టలక్ష్మిదేవతల మందిరం, ఆలయ ఆవరణలో నూటొక్క దేవతల రూపాలు, రాహు, కేతు విగ్రహాలు, గ్రామదేవతలు విగ్రహాలు, ఉపాలయాలు పచ్చని వనాలు, ప్రకృతి రమణీయ దృశ్యాల మధ్య నిర్మించారు. గూడుపమ్మ తల్లి నూతన ఆలయాన్ని ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు గొట్టుముక్కల శ్రీహరి రాజు తెలిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



తిమ్మరాజుపేటలో ముగ్గులు వేస్తున్న మహిళలు



మూలపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మండల వ్యాప్తంగా తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగ నుంచి గ్రామాల్లో తీర్థాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, మూలపేట గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు. మహిళలు పలు రకాల ముగ్గులు వేస్తున్నారు. మూలపేట గ్రామ తీర్థంలో భాగంగా ముగ్గుల పోటీల్లో విజేతలకు సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. పలువురు మహిళలు వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. రామాలయ కమిటీ అధ్యక్షుడు ఈశ్వర అప్పారావు, కాండ్రేగుల గాంధీ, ఆడారి జగన్నాథరావు, నాయుడు, ఈశ్వర అప్పారావు, మధుసూదనరావు, నాగేశ్వరరావు, ఆదికుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొగమంచుతో అవస్థలు



కోటవురట్లలో కమ్ముకున్న పొగమంచు

కోటవురట్ల: పొగమంచుతో అవస్థలు తప్పడం లేదు. సంక్రాంతి పండుగ వెళ్లినా మంచు వదల్లేదు. దట్టంగా అలుముకుంటున్న పొగమంచుతో రైతులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. రహదారులను కమ్మేయడంతో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక లైట్ల వెలుతురులో రాకపోకలు సాగిస్తున్నారు. చూసేందుకు కనువిందు చేసినా.. జీడి, మామిడి రైతులకు మాత్రం నష్టం తప్పేలా లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగమంచు కారణంగా పూత మాడిపోతోందని వాపోతున్నారు.

వైభవంగా కనకమహాలక్ష్మి జాతర

- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, వైఎస్సార్‌సీపీ నేతలు



కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు తరలివస్తున్న జనం



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల కోలాహలం

యలమంచిలి రూరల్: పట్టణంలోని ధర్మవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో కోలాహలం నెలకొంది. కాంతులీనుతున్న విద్యుద్దీపాలంకరణలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయానికి ప్రముఖులు క్యూకట్టారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకట రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు), మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లా రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ చైర్మన్లు అర్రెపు గుప్త, బెజవాడ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దపు యర్రయ్యదొర, కస్పా రవికుమార్, కొల్లి త్రినాథ్ తదితరులు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొటారు సాంబ, మడగల సత్యనారాయణ, కొటారు సూర్య ప్రకాష్ తదితరులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భారీ పోలీసు బందోబస్తు

జాతర పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా యలమంచిలి సీఐ ధనుంజయరావు నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎనిమిది మంది ఎస్సైలు, వంద మంది పోలీసులు ఎక్కడికక్కడ బందోబస్తును పకడ్బందీగా నిర్వహించారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ బందోబస్తును పర్యవేక్షించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోకి నాలుగు వైపుల నుంచి రాకపోకలు సాగించే బస్సులు, ఇతర వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడ క్రమబద్ధీకరించారు. జూద క్రీడలు, అల్లర్లు, కొట్లాటలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోటవురట్ల జూనియర్ కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల: పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంతో కళాశాల ప్రాంగణం పులకించింది. ఆనాటి కుర్రాళ్లేనా వీళ్లు అని ఆశ్చర్యపోతూ పరవశించింది. మిత్రుల ఆత్మీయ పరామర్శతో పొంగిపోయింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2010–12 విద్యా సంవత్సరంలో ఇంటర్ చదివిన సైన్సు విద్యార్థులు 13 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి తీపిగురుతులను స్మరించుకుని నవ్వుకున్నారు. ప్రస్తుత తమ స్థితిగతులను ఒకరికొకరు చెప్పుకున్నారు. ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది పడితే వారికి అండగా ఉందామని వాగ్దానం చేసుకున్నారు. ఎన్నాళ్లయినా తమ స్నేహబంధాన్ని పదిలంగా కాపాడుకుందామని ఒట్టేసుకున్నారు. ఆనాటి స్నేహబంధం అనుభూతిని పంచుకునేందుకు అందరినీ ఒక్కటి చేసిన పూర్వ విద్యార్థులు పదిలం గోవిందు, టి.బాలరాజు, జానకి దుర్గాప్రసాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండాట ఆడుతున్న ముగ్గురిపై కేసు

యలమంచిలి రూరల్: కనకమహాలక్ష్మి జాతరకు వచ్చే జనం జేబులు కొల్లగొట్టడమే లక్ష్యంగా కొందరు సమీపంలో గుండాట నిర్వహిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని ముగ్గురు నిర్వాహకులను పట్టుకున్నారు. కపిశెట్టి ప్రకాష్, యర్ర రాము, పూడి శ్రీనుల వద్ద నుంచి రూ.వెయ్యి, గుండాటకు ఉపయోగించిన డైస్, బోర్డులను స్వాధీనపర్చుకున్నామని పట్టణ ఎస్సై కే సావిత్రి ఆదివారం రాత్రి తెలిపారు.

రఘువర్మకు మద్దతుగా ఏపీటీఎఫ్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

యలమంచిలి రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరుతూ ఆదివారం యలమంచిలి పట్టణం, మండలంలో ఏపీటీఎఫ్ నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ మద్దతునిస్తున్న పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల నాయకులు ఉపాధ్యాయుల ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో యలమంచిలి మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేటి సత్యనారాయణ, మల్లిపాటి సత్యనారాయణ, రాంబిల్లి మండల శాఖ కార్యదర్శి కే అప్పాజీ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కే వీరభద్రరావు, వై సత్యారావు, కే నవీన్, బీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

25 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక



దిమిలి జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

రాంబిల్లి(యలమంచిలి): వారంతా 25 ఏళ్ల తర్వాత వారు చదివిన విద్యాలయంలో కలిశారు. తమ చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. దీనికి రాంబిల్లి మండలం దిమిలి జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికైంది. ఇక్కడ స్కూల్‌లో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. పాఠశాలంతా కలియతిరిగి వారు చదువుకున్న తరగతి గదులను చూసి ఆనందించారు. ఒక్కచోట కూర్చుని గ్రూప్ ఫొటో దిగారు.

గ్రామాల్లో సండడే సందడి

ఉత్సాహంగా ఆత్మీయ సమావేశాలు



మూలపేటలోని గంగాలమ్మ తల్లి సన్నిధిలో పూర్వ విద్యార్థులు



అరకులో విహారం చేస్తున్న మునగపాక పంచాయతీ పాలకవర్గ సభ్యులు



వాడ్రాపల్లి పారిపల్లెమ్మ అమ్మవారి సన్నిధిలో మళ్ల కుటుంబీకులు

మునగపాక: ఒకవైపు సంక్రాంతి సంబరాలు, మరో వైపు పూర్వ విద్యార్థులు, ఇంకోవైపు మళ్ల కుటుంబీకుల ఆత్మీయ సమావేశాలతో పల్లె వాతావరణం సందడిగా మారింది. మునగపాక పంచాయతీ పాలకవర్గ సభ్యులు అరకులో విహార యాత్ర నిర్వహించారు. రెండు రోజుల విహారయాత్రలో భాగంగా పర్యాటక ప్రాంతాలైన చాపరాయి, అరకులోని పద్మాపురం గార్డెన్, మ్యూజియం వంటి ప్రాంతాలను సందర్శించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణతో పాటు ఇతర పాలకవర్గ సభ్యులంతా ఆదివారం అరకులో సందడి చేశారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1984–85లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా సమీపంలోని మూలపేట గంగాలమ్మ తల్లి గుడి ప్రాంగణంలో కలుసుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని నాటి జ్ఞాపకాలను మననం చేసుకొని సంతోషపర్వం చెందారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. జల్లేపల్లి కిష్టప్ప, కాశీరావు, దాడి శివ, వెలగా ధర్మసూరి అప్పారావు, బీశెట్టి శ్రీరామ్, దాడి శ్రీను,వెంకటి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వాడ్రాపల్లి పారిపల్లెమ్మ ఆలయ ప్రాంగణంలో మళ్ల కుటుంబీకుల ఆత్మీయ సమావేశం జరిగింది. మండలంలోని మళ్ల ఇంటి పేరు కలిగిన కుటుంబాలంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, వైద్యులు మళ్ల బెనర్జీ, సూరప్పారావు, డాక్టర్ జోగారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి మళ్ల వరహా నరసింగరావు, కన్నుంనాయుడు నేతృత్వం వహించారు.

23 నుంచి గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవం విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు మునగపాక సంతబయిల జరిగే స్వర్ణోత్సవాల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. 23న ఉదయం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సాయంత్రం స్కిప్పింగ్ పోటీలు జరుగుతాయన్నారు. 24న సాయంత్రం ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. 25న రాత్రి 7 గంటలకు అరవింద్ ఆర్ట్స్' తాడేపల్లి వారిచే విడాకులు కావాలి నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 26న ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణ, ఆదర్శ రైతులకు సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు. అదేరోజు రాత్రి 8గంటలకు హైదరాబాద్ కళాంజలి వారిచే అన్నదాత నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురామ్, దాడి సూరిబాబు, మారిశెట్టి అప్పారావు, వెలగా శ్రీనివాసరావు, కుంది సూర్యనారాయణ, ఆడారి పరశురామ్, దాడి శ్రీరామమూర్తి, రామ్మోహనరావు, రామారావు, సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్



పెదగుమ్ములూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ఎస్.రాయవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని, వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పెదగుమ్ములూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు నిరసన తెలిపారు. అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు నష్టం కలిగించే విధంగా బీజేపీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తున్న బీజేపీ నేతలపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నప్పటికీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నోరు మెదపక పోవడం దారుణమన్నారు. అంబేడ్కర్‌ను కించపరచడంతో బీజేపీ నిజస్వరూపం బయటపడిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రకటించారని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి 240 సీట్లకే పరిమితం చేశారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు ఎం.సత్యనారాయణ, స్థానిక నాయకులు భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసమాన సేవ

- 15 వేల మందికి అన్నదానం
- 5 ఏళ్లుగా జాతరకొచ్చిన భక్తుల ఆకలి తీర్చుతున్న కొఠారు నానాజీ కుటుంబం



భక్తులకు ఆహారపదార్థాలు వడ్డిస్తున్న కొఠారు నానాజీ కుటుంబ సభ్యులు

యలమంచిలి రూరల్: వారిదో సాధారణ మధ్య తరగతి కుటుంబం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకొచ్చే భక్తుల ఆకలి తీర్చుతున్నారు. ఐదేళ్లుగా అన్నదానం చేస్తూ అందరి మన్ననలను పొందుతున్నారు యలమంచిలి పట్టణం ధర్మవరానికి చెందిన కొఠారు నానాజీ కుటుంబం. నానాజీ పెద్ద కుమార్తె భవ్యశ్రీ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. నెలకు రూ.55 వేల వేతనం. తన వేతనం నుంచి రోజుకు రూ.1200 చొప్పున ప్రతి నెలా రూ.30 వేల వరకు పొదుపు చేసి ఏడాది తర్వాత కనకమహాలక్ష్మి జాతర రోజున రూ.4 లక్షలు ఖర్చు చేసి 15 వేల మందికి పైగా భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ఆదివారం యలమంచిలిలో కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు నిరాటంకంగా భోజనం పెట్టారు. నానాజీ కుటుంబ సభ్యులే స్వయంగా భోజన పదార్థాలు వడ్డించడం మరో విశేషం. భోజనం చేసిన తర్వాత మంచినీటి ప్యాకెట్లను వృద్ధురాలైన నానాజీ తల్లి బుల్లెమ్మ(75) రోజంతా అలసట చెందకుండా జనానికి అందించారు. వీరికి కుటుంబ సభ్యులు శేఖర్, గోవర్దన్, షణ్ముఖ, తిరుమలరావు, శ్రీను, సంతోష్ కుమార్, హైమ తదితరులు సహకారం అందించారు. భోజన కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల తమ మనసుకు నిండైన ఆనందం కలుగుతుందని, పెద్ద సంఖ్యలో భక్తుల ఆకలి తీర్చడం వల్ల అమ్మవారు తమ కుటుంబాన్ని చల్లగా చూస్తుందని నానాజీ కుటుంబ సభ్యులు నమ్ముతున్నారు. అంతకుముందు అమ్మవారి ఆలయం పక్కనున్న ఇండోర్ స్టేడియం ఆవరణలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు ప్రారంభించారు. అన్ని దానాల కంటే అన్నదానం మహాదానంగా భావిస్తూ పైసా ఆశించకుండా ఇతరుల ఆకలి తీర్చడంలో ఎంతో సంతృప్తినిస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పాయకరావుపేట డివిజన్:

9951602901

Office mail : sakshiadvtvsp@gmail.com